ప్రజాశక్తి
బుధవారం 19 జూన్ 2024
5
అనంతపురం

డెంగీ, మలేరియా నియంత్రణకు చర్యలు

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో మలేరియా, డెంగీ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం నాడు కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ నివారణకు అన్ని శాఖల అధికారులు తమ తమ పరిధిలో శానిటేషన్, క్లోరినేషన్, స్ప్రేయింగ్, ఫాగింగ్ వంటి పనులు సకాలంలో చేయించాలన్నారు. మలేరియా సిబ్బంది సహకారంతో అన్ని వసతి గహాల్లో ఐఆర్ఎస్ స్ప్రేయింగ్ చేయించుకోవాలని జెడి సాంఘిక సంక్షేమ అధికారికి ఆదేశించారు. గ్రామపంచాయతీ, మునిసిపల్ అధికారులు చెత్త తొలగించడం, మురుగునీరు సక్రమంగా పారేటట్లు చేయాలన్నారు. మురుగునీరు నిల్వ ఉన్న గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అన్ని తాగునీటి టాంకులను క్లోరినేట్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, డిఆర్ఓ రామకష్ణారెడ్డి, డిఎంహెచ్ఓ డా॥ఈబి.దేవి పాల్గొన్నారు.

వానొచ్చాక కరువు పరిశీలన..!

◆ రబీ కరువు చూసేందుకు కేంద్ర కరువు బృందం రాక ◆ నేడు,రేపు ఉమ్మడి జిల్లాలో పర్యటన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

2023-24 సంవత్సరం రబీ కరువును చూసేందుకు ప్రస్తుత ఖరీఫ్‌లో కేంద్ర కరువు బృందం ఉమ్మడి అనంతపురం జిల్లాకు రానుంది. బుధ, గురువారాలు రెండు రోజులపాటు కేంద్ర కరువు బృందం ఈ జిల్లాలో పర్యటించనుంది. సాధారణంగా రబీ సీజన్ అక్టోబర్‌లో ప్రారంభమై మే నెలతో ముగుస్తుంది. 2023 అక్టోబర్‌లో ప్రారంభమై 2024 మేతో ముగుస్తుంది. ఈ కాలంలో జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులే నెలకొన్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అనంతపురం జిల్లాలో 14 మండలాలను, సత్యసాయి జిల్లాలో ఒక్క మండలాన్ని కరువు మండలంగా ప్రకటించింది. రబీ సీజన్‌కు కీలకమైన అక్టోబర్, నవంబర్, డిసెంబరు మూడు మాసాల్లో అనంతపురం జిల్లాలో 67.1 శాతం వర్షపాతం లోటుంది. ఆ సీజన్‌లో 139.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవ్వాల్సి ఉండగా 45.8 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయింది. ఆ తరువాత జనవరి, ఫిబ్రవరి మాసాల్లోనూ ఒక్క వాన చినుకు నేల రాలలేదు. ఐదు మాసాలుగా తీవ్ర వర్షాభావంతో రబీలో వేసిన పంటలు మొత్తం దెబ్బతిన్నాయి. తాగునీటి సమస్య కూడా ఉత్పన్నమైంది. మొత్తం సార్వత్రిక ఎన్నికలు కూడా అదే సమయంలో రావడంతో కరువును పట్టించుకున్న దాఖలాల్లేవు. ఇప్పుడు ఖరీఫ్ మొదలయ్యింది. జూన్ నెలాఖరులో వర్షాలు పడిన తరువాత కేంద్ర కరువు బృందం జిల్లాకు విచ్చేస్తోంది. అది కూడా జూన్ నెలలో భారీగా వర్షాలు పడిన విడపనకల్లు, వజ్రకరూరు మండలాల్లో పర్యటించనుంది. విడపనకల్లులో ఈ నెలలో ఇప్పటి వరకు పడిన వర్షపాతం 203 శాతం అధికంగా ఉంది. సాధారణ వర్షపాతం 47 మిల్లీమీటర్లు జూన్‌లో ఇప్పటి వరకు పడాల్సి ఉంటే 142.8 మిల్లీమీటర్లు నమోదయింది. వజ్రకరూరు మండలంలో ఏకంగా 609 శాతం అధికంగా వర్షపాతం పడింది. ఇక్కడ సాధారణ వర్షపాతం 29.3 మిల్లీమీటర్లకుగానూ 207.3 మిల్లీమీటర్లు నమోదయింది. ఈ మండలంలో కరువు బృందం పర్యటించనుండటం గమనార్హం. బృందం పర్యటించే ఉరవకొండ, కణేకల్ మండలాల్లోనూ మంచి వర్షపాతమే నమోదయింది. రైతులు పంటలు సాగుకు సమయత్తమవుతున్న సమయంలో కరువు పరిశీలనకు రావడం విమర్శలకు తావిస్తోంది.

నేడు,రేపు కరువు బృందం పర్యటన

కేంద్ర కరువు బృందం నేడు,రేపు ఉమ్మడి అనంతపురం జిల్లాలో పర్యటించనుంది. మంగళవారం రాత్రికే కేంద్ర కరువు బృందం అనంతపురం నగరంకు చేరుకుంటుంది. బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రెవెన్యూ భవనంలో కరువుపై సమీక్ష ఉండనుంది. అనంతరం భోజన విరామం తరువాత రెండు బృందాలుగా విడిపోయి ఒక బృందం కర్నూలు జిల్లాకు మరో బృందం రొద్దంకు క్షేత్ర స్థాయి పర్యటన చేపట్టనుంది. మరుసటి రోజు గురువారం ఉదయం 9.30 గంటలకు విడపనకల్లు మండలం మల్లాపురం, గూళ్యపాలెం గ్రామాల్లో పర్యటించనున్నారు. భోజన విరామం తరువాత ఉరవకొండ మండలం నింబగళ్లు, కణేకల్ మండలం సొల్లాపురం, పెద్దకౌకుంట్ల గ్రామాల్లో పర్యటించనున్నారు. అనంతరం విజయవాడకు కేంద్ర కరువు బృందం వెళ్తుంది.


మోటూరు హనుమంతరావుకు నివాళి అర్పిస్తున్న ప్రజాశక్తి అనంతపురం ఎడిషన్ సిబ్బంది

మోటూరు హనుమంతరావుకు నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజాశక్తి వ్యవస్థాపక సంపాదకుడు, సిపిఎం నాయకుడు మోటూరు హనుమంతరావు 23వ వర్ధంతి కార్యక్రమాన్ని అనంతపురం ఎడిషన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఎడిషన్ మేనేజర్ ఎన్.వేణుగోపాల్ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మోటూరు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటూరు హనుమంతరావు అసమాన్య ప్రతిభాసాలి అన్నారు. ప్రజాశక్తి వ్యవస్థాపక సంపాదకుడిగా ఆయన విశేష సేవలు అందించారన్నారు. ప్రజాశక్తి సంపాదకునిగానే కాకుండా సిపిఎం నాయకునిగా అనేక ప్రజాపోరాటాలు నిర్వహించారన్నారు. ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, రాజ్యసభ సభ్యునిగానూ పని చేసి చట్ట సభల్లో ప్రజావాణిని విన్పించారని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో అందరూ ముందడుగా వేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి అనంతపురం ఎడిషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అభిమానులకు అభివాదం చేస్తున్న మంత్రి సత్యకుమార్

ర్యాలీలో పాల్గొన్న కూటమి శ్రేణులు

మంత్రి సత్యకుమార్‌కు ఘనస్వాగతం

◆ అనంత జిల్లా సరిహద్దు నుంచి ధర్మవరం వరకు రోడ్‌షో ◆ భారీ గజమాలలతో అభిమానుల ఆహ్వానం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్, ధర్మవరం టౌన్, బత్తలపల్లి

రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి మంగళవారం నాడు మొదటి సారి జిల్లాకు విచ్చేసిన సత్యకుమార్‌కు టిడిపి, బిజెపి, జనసేన నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతపురం జిల్లా సరిహద్దు గుత్తి బాటసుంకులమ్మ ఆలయం నుంచి ధర్మవరం నియోజకవర్గం కేంద్రం వరకు అభిమానులు అడుగడుగునా క్రేన్ల ద్వారా భారీ గజమాలలతో స్వాగతం పలికారు. అనంతపురంలో శింగనమల, అనంతపురం ఎమ్మెల్యేలు బండారు శ్రావణిశ్రీ, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అక్కడి నుంచి ర్యాలీలో ధర్మవరం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డితో కలిసి మంత్రి ఓపెన్ టాప్ కారుపై ర్యాలీగా ధర్మవరం చేరుకున్నారు. అనంతపురం, బత్తలపల్లి మీదుగా ధర్మవరం వరకు రోడ్‌షో కొనసాగింది. ధర్మవరం చేరుకోగానే శివానగర్ సర్కిల్ వద్ద నేతన్న విగ్రహానికి సత్యకుమార్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చేనేత విగ్రహం వద్ద మంత్రి నేలపై సాష్టాంగ నమస్కారం చేసి, మట్టిని నుదిటిపై రాసుకున్నాడు. కళాజ్యోతి సర్కిల్ వద్దనున్న దుర్గమ్మ గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అదే మార్గంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చక్రవర్తి థియేటర్ వద్ద సందాబ్రదర్స్ సందారాఘవ, సంధారవి, జింకా బ్రదర్స్ జింకా నాగభూషణ, జింకాగిరి జింకా పురుషోత్తం, పాళ్లెం ప్రసాద్‌లు మంత్రి సత్యకుమార్‌కు బారీ గజమాల వేశారు. అక్కడే భారీకేక్‌ను కట్ చేయించారు. అక్కడి నుంచి నేరుగా మంత్రి దుర్గానగర్ ఎదురుగా నూతనంగా నిర్మించిన ప్రభుత్వాస్పత్రి ఆవరణంలో మొక్కలు నాటారు. రాప్తాడు ఎమ్మెల్యే సునీత, టిడిపి పట్టణ అధ్యక్షులు పరిశేసుధాకర్, చింతలపల్లి మహేష్ చౌదరి మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కోటి సూర్య ప్రకాష్ బాబు, ఆకులేటి వీరనారప్ప, ఉపసర్పంచి కోటి గోపీనాథ్, తెలుగు యువత నాయకులు తాళ్లూరు సతీష్ కుమార్ చౌదరి, ధర్మవరం నియోజవర్గం తెలుగు రైతు అధ్యక్షులు చల్లా శ్రీనివాస నాయుడుతో పాటు ధర్మవరం నియోజకవర్గంలోని కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బడితోనే చిన్నారులకు ఉజ్వల భవిష్యత్తు

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం - 2009కి సంబంధించిన పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

చిన్నారుల ఉజ్వల భవిష్యత్తు బడిలోనే సాకారం అవుతుందని, దీని కోసం ప్రతి ఒక్కరూ పిల్లలను పాఠశాలకు పంపాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ తెలియజేశారు. మంగళవారం నాడు అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో బడి బయట ఉన్న పిల్లలందరూ బడిలో చేరాలనే నిదాదంతో ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం - 2009కి సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రేపటి దేశ చిన్నారుల ఉజ్వల భవిష్యత్తు కోసం చిన్నారులను ఈ రోజు నుంచే బడికి పంపాలని, అమ్మాయిలను చదువుకోనిచ్చి జీవితంలో ఎదగనిద్దామని సూచించారు. బాల్య వివాహాలు జరిగే సమయంలో వివాహం జరగకుండా అడ్డుకున్న తర్వాత సంబంధిత పిల్లలు, బాల కార్మికులుగా గుర్తించిన పిల్లలను సంబంధిత అధికారులు పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, డిఆర్ఓ రామకృష్ణారెడ్డి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ బిఎన్.శ్రీదేవి, బాలల పరిరక్షణ సమితి అధికారి మంజునాథ్, ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకటేశ్వరి, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ (1098) కృష్ణమాచారి, డిసిపియు సిబ్బంది వెంకట్ కుమార్, డిఇఒ నాగరాజు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో అరకొర సౌకర్యాలు..!

◆ కాంట్రాక్టు అధ్యాపకులతో బోధన ◆ వెంటాడుతున్న తాగునీరు, మరుగుదొడ్ల సమస్యలు ◆ క్రీడా మైదానం లేక ఆటలకు దూరమవుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

బొమ్మనహాల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి 450 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అందులో 150 మంది బాలికలు ఉన్నారు. కాంట్రాక్టు అధ్యాపకుల తోనే బోధన తరగతుతు నిర్వహిస్తున్నా గతేడాది ద్వితియ సంవత్సరం ఫలితాల్లో మంచి ఉత్తీర్ణత సాధించారు. అయితే కళాశాలలో తాగునీరు, మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. ఈ కళాశాల నాడు-నేడు కింద ఎంపిక కావడంతో మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టారు. అయితే అవి అర్థాంతరంగా ఆగిపోయాయి. కళాశాల ప్రాంగణం మొత్తం చౌడు భూమి కావడంతో ఎక్కడ చూసినా వర్షం నీరు నిల్వ ఉండి నడవడానికి కూడా కష్టంగా తయారైంది. ప్రధానంగా సివిక్స్, జువాలజీ, మ్యాథ్స్ సబ్జెక్టులను కాంట్రాక్టు అధ్యాపకులే బోధిస్తున్నారు. సైన్స్ సబ్జెక్టుకు సంబంధించి ల్యాబ్, పరికరాలు పూర్తి స్థాయిలో లేకపోవడంతో విద్యార్థులకు ప్రాక్టికల్స్ అరకొరగానే నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. క్రీడీ మైదానం లేకపోవడంతో విద్యార్థులకు ఆటలకు దూరమవుతున్నారు. మండలంలోని సుమారు 25 గ్రామాల నుంచి విద్యార్థులు కళాశాలకు వస్తుంటారు. బళ్లారి-కణేకల్ మార్గంలో తిరిగే ఆర్టీసీ బస్సులు ఏం డిపోలో బస్సు పాసులు పొందారో అదే డిపో బస్సు ఎక్కి ప్రయాణించాలని షరతులు విధించడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విధి లేని పరిస్థితుల్లో విద్యార్థులు ప్రధాన రహదారి నుంచి 6 కిలోమీటర్లు నడిచి కళాశాలకు చేరుకుంటున్నారు. బస్సుల విషయమై పలుమార్లు ప్రిన్సిపల్‌కి ఫిర్యాదు చేసినా స్పందించలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై కళాశాల ప్రిన్సిపల్ మోహన్‌కుమార్‌ను వివరణ కోరగా జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు.

నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లు (ఇన్‌సెట్‌లో మౌలిక సదుపాయాలపై ఆవేదన వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు)

ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎస్ఆర్ కళాశాలను సీజ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ

అనంతపురం కలెక్టరేట్ : అనుమతులు లేని నగరంలోని మార్కెట్ యార్డుకు ఎదురుగా ఉన్న ఎస్ఆర్ కళాశాలను వెంటనే సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక కళాశాల ఎదురుగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న ఎస్ఆర్ బాలికల కళాశాలకు అనుమతులు లేనప్పటికీ అడ్మిషన్లు తీసుకుని రూ.లక్షలు వసూలు చేస్తున్నారన్నారు. అదేవిధంగా కళాశాల పేరుతో ముద్రించిన పాఠ్య పుస్తకాలను విక్రయిస్తున్నారన్నారు. కాసులకు కక్కుర్తి పడుతున్న ఇలాంటి కళాశాలల పట్ల ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కేవలం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా, నిరసనలు తెలియజేసిన సందర్భంలో మాత్రం వచ్చి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడమే తప్ప చేసిందేమీ లేదన్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాధికారులు స్పందించి అనుమతులు లేని ఎస్ఆర్ కళాశాలను సీజ్ చేయాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిద్ధు, తరిమెల గిరి, నగర అధ్యక్ష కార్యదర్శులు శివ, భీమేష్, నాయకులు సోము, వివేక్, రాజేష్, నిరంజన్, మహేష్, చందు, మహేష్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

29న జాతీయ లోక్‌అదాలత్

రాయదుర్గం : జాతీయ న్యాయ సేవాసంస్థ ఆదేశాల మేరకు ఈనెల 29న రాయదుర్గంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవ అధికార సంస్థ అధ్యక్షులు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రమ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీపడే కేసులు, కోర్టులో పెండింగ్‌లో ఉన్నవి, లేని కేసులకు లోక్‌దాలత్‌లో పరిష్కారం చూపనున్నట్లు తెలిపారు.

మంత్రి కేశవ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పరిటాల సునీత

మంత్రి పయ్యావులను కలిసిన ఎమ్మెల్యే సునీత

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్‌ను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కలిశారు. మంగళవారం ఉదయం ఉరవకొండ మండలం, కౌకుంట్ల గ్రామంలోని మంత్రి నివాసంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు కొంతసేపు నియోజకవర్గాల్లో అభివృద్ధిపై మాట్లాడుకున్నారు. కేశవ్‌కు మంత్రి పదవి రావడంపై పరిటాల సునీత అభినందనలు తెలియజేశారు.

జిల్లాలో 2.76లక్షల మందికి 'పిఎం కిసాన్'

కలెక్టర్ వినోద్‌కుమార్

కలెక్టర్ వినోద్‌కుమార్, ఎంపీ అంబికా నుంచి బెస్ట్ ఇన్నోవేటివ్ ఫార్మర్ అవార్డు అందుకుంటున్న పెరవలి పుచ్చకాయల రాము

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

జిల్లాలో 2.76 లక్షల మంది రైతులకు రూ.55.58 కోట్ల మేర పిఎం కిసాన్ నిధులు విడులైనట్లు కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి కృషి సమ్మాన్ నిధి 17వ విడుత నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. తద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 5.28 లక్షల మంది రైతులకు రూ.106 కోట్లపైగా లబ్ధి చేకూరనుందన్నారు. ఇందులో అనంతపురం జిల్లాలో 2.76 వేల మంది రైతులకు రూ.55.58 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాలో 2.52 లక్షల మంది రైతులకు రూ.50.44 కోట్ల లబ్ధి కలుగుతోందన్నారు. ఇకపోతే రైతులు పొలాల్లో పంటతో పాటు ఆవు, మేక, కోళ్ల లాంటివి పెట్టుకోవాలని, పొలంలో రెండు మూడు రకాల ఎరువులు వేయడం, ఫారంపాండ్, ట్రెంచ్, బండ్ లాంటివి ఏర్పాటు చేసుకోవాలన్నారు. పంట పెట్టడంతోపాటు పొలం చుట్టూ చెట్లను పెంచాలని, దాని ద్వారా ఆదాయం లభిస్తుందన్నారు. జిల్లాలో పలుచోట్ల, మున్సిపాలిటీలలో చెట్లను నరకకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం శింగనమల మండలం పెరవలి గ్రామానికి చెందిన పుచ్చకాయల రాముకు బెస్ట్ ఇన్నోవేటివ్ ఫార్మర్ అవార్డుని అందజేశారు. తర్వాత ఐసిహెచ్-66 హైబ్రిడ్ విత్తనాలను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలోపార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, ఎంపిపి డి.సునీత, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఏ.ఆర్.ఎస్ ప్రిన్సిపల్ సైంటిస్ట్, హెడ్ బి.సహదేవరెడ్డి, రెడ్డిపల్లి సర్పంచ్ ఎస్.నరసమ్మ, రెడ్డిపల్లి ఏ.ఆర్.ఎస్ ప్రిన్సిపల్ సైంటిస్ట్, హెడ్ భార్గవి, రెడ్డిపల్లి కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎస్.ఎన్.మల్లేశ్వరి, ఎస్ఎంఎస్ హోంసైన్స్ శాస్త్రవేత్త సుధారాణి, క్రాఫ్ ప్రొటెక్షన్ శాస్త్రవేత్త శశికళ, వెటర్నరీ సైన్స్ శాస్త్రవేత్త మాధవి, అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ శాస్త్రవేత్త చందన, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మొక్క నాటి నీరు పోస్తున్న ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ఉద్యమంలా మొక్కల పెంపకం

ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-వజ్రకరూరు

జిల్లాలో ఉద్యమంగా మొక్కల పెంపకం చేపట్టాలని ఆర్థికశాఖ పయ్యావుల కేశవ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఉరవకొండ మండలంలోని కౌకుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఇందులో భాగంగా మంత్రి మొక్క నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జపనీస్ టెక్నిక్ మియావాకీ సైంటిఫిక్ పద్ధతిలో వివిధ నమూనాల్లో మొక్కలు నాటాలన్నారు. జిల్లావ్యాప్తంగా అన్నిచోట్లా మొక్కల పెంపకంతోపాటు జాగ్రత్తగా సంరక్షించాలన్నారు. రకరకాలు మొక్కల పంపకం చేపట్టాలన్నారు. మొక్కలు నాటడం.. సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అనిన్నారు. డిఎఫ్ఒ వినీత్‌కుమార్ జిల్లాలో నీటి సంరక్షణ, మెగా ప్లాంటేషన్ కార్యక్రమాలు, కళ్యాణదుర్గం, రాయదుర్గంలోని నగర వనాల అభివద్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఇఒ వైఖోమ్ నిదియాదేవి, అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, అటవీ శాఖ అధికారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన వీడ్కోలు సంబరాలు

ప్రజాశక్తి-అనంతపురం

ఆలమూరు రోడ్డులో ఉన్న శ్రీకృష్ణదేవరాయ వ్యసాయ కళాశాలలో నాలుగవ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పివికెకె కరస్పాండెట్, సెక్రటరీ పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ కళాశాలలో విద్యను పూర్తి చేసుకుని వెళ్లే విద్యార్థులందరూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా రైతులకు ఉపయోగపడే విధంగా జీవితంలో ఎదగాలని కోరారు. వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చాలా అవకాశాలు ఉన్నాయన్నారు. అయితే మీరే సొంతంగా వ్యవస్థాపకులుగా ఎదిగి ఎందరికో ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. కళాశాల అసోసియేట్ డీన్ రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అభ్యసించిన విషయాలను రైతులకి తెలిపి కొత్త వంగడాలు, పరికరాలపై చైతన్యం కల్పించాలనానరు. రైతు ఎదగడం లక్ష్యంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు తమ నాలుగు సంవత్సరాల కళాశాల జీవితాన్ని అందమైన జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ఈ కార్యక్రమంలో పివికెకె నిర్వహణ ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ నారాయణరెడ్డి, ఆచార్యులు రామకృష్ణ, రామస్వామి, విద్యార్థి వ్యవహారాల ఇన్‌ఛార్జి కొండారెడ్డి, పరిపాలన అధికారి ముత్యాలప్ప, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'కోడెల' ఆత్మహత్యపై విచారించాలి

ఎస్పీకి వినతిపత్రం సమర్పిస్తున్న టిడిపి మహిళా నాయకురాళ్లు

అనంతపురం : అసెంబ్లీ మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ ఆత్మహత్యపై విచారించి కారకులపై చర్యలు తీసుకోవాలని తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని వాల్మీకి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం నగరంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ గౌతమిసాలిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోడెల శివప్రసాద్ ఆత్మహత్యకు మాజీ సిఎం జగనే కారణమన్నారు. ఎందుకంటే వైసిపి అధికారంలోకి వచ్చాక శివప్రసాద్‌పై మోపిన సెక్షన్ల ప్రకారం కేసు ఫైల్ చేసి 10ఏళ్లకు తగ్గకుండా శిక్ష పడేలా జైలుకు పంపాలని జగన్ కుట్ర చేశారన్నారు. అలాగే ప్రజలు సొమ్ముతో కొన్న రూ.కోట్లు విలువజేసే ఫర్నీచర్‌ను తాడేపల్లి ప్యాలెస్‌కి దొంగతనంగా తీసుకెళ్లిన జగన్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

మంత్రి సత్యకుమార్‌ను కలిసిన టిడిపి నేతలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మంత్రి సత్యకుమార్‌తో జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను ఎమ్మెల్యేలు, జిల్లా టిడిపి నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా జిల్లాకు వచ్చిన ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అల్పాహార విందులో పాల్గొన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఎంపీలు పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు కాలువ శ్రీనివాసులు, దగ్గుపాటి ప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, జిల్లా టిడిపి అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, తదితరులు ఉన్నారు. కాగా హిందూపురం ఎంపీ బికె పార్థసారథిని టిడిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, గ్రంథాలయం సంస్థ మాజీ ఛైర్మన్ గౌస్‌మోదీన్ మర్యాదపూర్వకంగా కలిశారు.

మంత్రికి బొకే అందజేస్తున్న డిఎంహెచ్ఒ

డిఎంహెచ్ఒ...

అనంతపురం : ఆరోగ్య వైద్య విద్య, సంక్షేమ శాఖ మంత్రి వై.సత్యకుమార్‌ను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఇబి.దేవి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

జనసేన నాయకులు...

బెలుగుప్ప : రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్‌ను మండల జనసేన నాయకులు కలిసి మంగళవారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బెలుగుప్ప మండల జనసేన అధ్యక్షులు కాశంశెట్టి సుధీర్, బిజెపి నాయకులు వన్నూరుస్వామి, హరినాథ్ గుప్త, కోణంకి ఎర్రిస్వామి, సుంకన్న పాల్గొన్నారు.

చెవిటి మిషన్లు పంపిణీ

అనంతపురం : అనంతపురం చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల్లో పుట్టుకతోనే చెవిటి, మూగ ఉన్న 15 మంది పిల్లలకు అమ్మ సంస్థం ఆధ్వర్యంలో చెవిటి మిషన్లు పంపిణీ చేశారు. ఆయా విద్యార్థులకు మైసూర్‌లో పరీక్షలు నిర్వహించిన వైద్యులు వినికిడి లోపం ఉన్నట్లు గుర్తించి మిషన్లు వాడాలని సూచించారు. విషయాన్ని 'అమ్మ' సంస్థ వ్యవస్థాపకులు రమణారెడ్డికి తెలపడంతో ఆయన సైమన్స్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని అడ్వాన్సు హియరింగ్ ఎయిడ్ ఒక్కొక్కరికి రూ.18వేలు విలువజేసే పరికరాలను 15 మందికి అందజేశారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎంతోమంది మూగ, చెవిటి గురైన విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆటంకం కలుగుతోందన్నారు. ఇలాంటి విద్యార్థులకు 'అమ్మ' సంస్థ తరపున అవసరమైతే కొన్ని సర్జరీల ద్వారా లోపాల్ని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



వినికిడి లోపం ఉన్న పిల్లలతో అమ్మ సంస్థ అధ్యక్షులు తరిమెల రమణారెడ్డి

సమస్యల వలయంలో ఆదర్శ పాఠశాల

తాగునీటి కోసం విద్యార్థుల అవస్థలు
ఉపాధ్యాయుల కొరత
ఏళ్లు గడుస్తున్నా క్రీడా మైదానం కరువు
అతీగతి లేని వంటగది, ప్రహరీ
గుత్తి ఆదర్శ పాఠశాలలో పరిస్థితి..

గుత్తి వద్ద ఉన్న ఆదర్శ పాఠశాల

ప్రజాశక్తి-గుత్తి

ప్రజాప్రతినిధుల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యంతో ఎపి ఆదర్శ పాఠశాల (కళాశాల) సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతోంది. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో 2013లో అప్పటి ప్రభుత్వం రాష్ట్రంలో ఆదర్శ పాఠశాలలను ప్రారంభించింది. ఇందులో భాగంగానే మండల కేంద్రంలో రూ.3కోట్లు వెచ్చించి ఆదర్శ పాఠశాల (కళాశాల), రూ.1.50 కోట్లు వ్యయంతో విద్యార్థినుల కోసం వసతి గృహాన్ని నిర్మించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎపి ఆదర్శ పాఠశాల (కళాశాల)ను రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (ఆర్ఎంఎస్ఎ) నిర్వహించేది. అయితే కొన్నేళ్ల తర్వాత సర్వ శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఎ)లోకి విలీనమైంది. ఆదర్శ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పాఠశాల ప్రారంభం నుంచే విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారు. స్థానిక ఆదర్శ పాఠశాల (కళాశాల) 6వ తరగతి నుంచి ఇంటర్ వరకూ దాదాపు 820 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. బాలికల వసతి గృహంలో 100 మంది విద్యార్థులు ఉంటున్నారు. కాగా ఏళ్లు గడుస్తున్న పాఠశాలలో నెలకొన్న సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. కనీసం తాగునీటి కోసం ఇప్పటికీ తిప్పలు తప్పడం లేదంటే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. నాడు-నేడు పథకం కింద రూ.40 వేలు నిధులతో పాఠశాల వద్ద ఏర్పాటు చేసినా తాగునీటి పథకం ద్వారా వస్తున్న అరకొర నీటితోనే విద్యార్థులు కాలం వెలదీస్తున్నారు. ఇక మరుగుదొడ్ల పరిస్థితి వర్ణనాతీతం. గతంలో మున్సిపాలిటీ అధికారులు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసేవారు. ప్రస్తుతం ఆ నీటిని అధికారులు నిలిపివేశారు. దీంతో నీటి సమస్య జఠిలమైంది. పాఠశాల సమీపంలోని 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న వైటిసి ప్రాజెక్టుకు సంబంధించిన పైప్‌లైన్ నుంచి కనెక్షన్ ఇచ్చి ప్రతిరోజు తాగునీటిని సరఫరా చేస్తే సమస్య తీరుతుంది. డ్రెయినేజీ సమస్య నెలకొంది. పాఠశాలతోపాటు వసతి గృహానికి ప్రహరీ నిర్మించలేదు. ఇక క్రీడా మైదానం ఊసే లేదు. అయినప్పటికీ విద్యార్థులు క్రీడల్లో రాణిస్తున్నారు.

ప్రహరీ లేకుండా ఉన్న ఆదర్శ పాఠశాల

బండల్లో ఉన్న వంట గది

వంట గది నిర్మాణం చేపట్టలేదు. తాత్కాలికంగా బండల నాటి షెడ్డు ఏర్పాటు చేశారు. వర్షం వస్తే విద్యార్థులకు భోజనం చేయడానికి మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు ఉపాధ్యాయుల కొరతా వేధిస్తోంది. టీజీటీ ఇంగ్లీషు, సైన్సు, తెలుగు బోధించేందుకు ఉపాధ్యాయులు లేరు. ఉపాధ్యాయుల కొరతతో విద్యా సంవత్సరానికి సిలబస్ పూర్తి కావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆదర్శ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఎపి ఆదర్శ పాఠశాలకు సంబంధించి బాలికల వసతి గృహంలో సీట్ల సంఖ్య పెంచాలని కోరుతున్నారు.

ప్రజాశక్తి బాలల ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం



గుమ్మఘట్ట మండలంలో ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ఎంఇఒలు నాగమణి, రామచంద్ర, తదితరులు

ప్రజాశక్తి రూపొందించిన బాలల ప్రత్యేక సంచిక విద్యార్థులకు ఓ విజ్ఞాన భాండాగారంలా ఉపయోగపడుతుందని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలో ప్రజాశక్తి బాలల ప్రత్యేక సంచికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాశక్తి సంస్థ ఎప్పుడూ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సమాజ శ్రేయస్సు కోసం అలుపెరుగని పోరాటం చేస్తూనే ఉంటుందన్నారు. ప్రత్యేక సంచికలో రూపొందించిన కథలు, బొమ్మలు, సామాజిక కార్యకర్తల అనుభవాలు.. వారి ఆలోచన విధానం, వారు పొందిన అభివృద్ధిని కథల రూపంలో ఇవ్వడం చాలా గొప్ప విషయమన్నారు. దీంతోపాటు అనేక పాఠశాలల్లో ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు నరేష్‌కుమార్, హిమ శేఖర్, రాజన్న, ఎర్రిస్వామి, గాజుల ప్రభాకర్, మారుతి, ఉదయ్‌కుమార్, జగదీష్, రామాంజనేయులు, నూర్ మహమ్మద్, నరసింహారెడ్డి, గీతావాణి, హేమావతి, చంద్రశేఖర్, చిన్న వన్నప్ప, సుధాబాయి, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట : మండల పరిధిలోని హైస్కూల్‌లో ప్రజాశక్తి పిల్లల తీసుకొచ్చిన ప్రత్యేక సంచికను ఎంఇఒ వెంకటరమేష్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ మినుగురులు పుస్తకం పిల్లలకు ఎంతో ప్రయోజనకరంగా ఉందన్నారు. పిల్లలకు విలువైన సమాచారంతోపాటు ప్రోత్సహించే విధంగా సంచికను రూపొందించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్లు దివ్య, అశోక్‌రెడ్డి, రాజు, వెంకటేశులు, గంగయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

'అంగన్వాడీ'లతో చిన్నారులకు బంగారు భవిష్యత్తు

ప్రజాశక్తి-వజ్రకరూరు

చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అంగన్వాడీలు

రెండున్నరేళ్ల నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు, క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయడం అంగన్వాడీ సెంటర్లతోనే సాధ్యమని ప్రధానోపాధ్యాయులు నారాయణస్వామి అన్నారు. మంగళవారం విడపనకల్ మండల పరిధిలోని పాల్తూరు అంగన్వాడీ కేంద్రంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు రెండున్నరేళ్ల నుంచి ఐదేళ్లలోపు చిన్నారులను కచ్చితంగా అంగన్వాడీ సెంటర్లలో చేర్పించాలన్నారు. అంగన్వాడీల్లో నిర్వహించే ప్రీస్కూల్‌లో చిన్నారులకు నేర్పించే ఆటపాటలపై తల్లులకు పూర్తి అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరిగి పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్చాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు దుర్గాదేవి, రాధా, నాగవేణి, మల్లేశ్వరి, లక్ష్మీదేవి, ఈరమ్మ, ఆయాలు, కిషోర బాలికలు, తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై హర్షం

ప్రజాశక్తి-గుత్తి

హర్షం వ్యక్తం చేస్తున్న లాయర్లు

టిడిపి అధికారంలోకి వచ్చాక ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను సిఎం చంద్రబాబు రద్దు చేయడం పట్ల మంగళవారం గుత్తిలో న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు స్థానిక న్యాయస్థానాల సమీపంలో ఉన్న బార్ అసోసియేషన్ భవనం వద్ద కేక్ కోసి పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పీడీ.రత్నం, ప్రధాన కార్యదర్శి నగదాని చంద్రశేఖర్, కార్యదర్శి నవీన్, సీనియర్ న్యాయవాదులు కె.మనోహర్‌బాబు, ఆర్‌వి.చలపతి, నరసింహులు, జెడ్.సతీష్, రసూల్, సుబ్రమణ్యం, ఖమర్ బేగం, టిడిపి లీగల్ సెల్ సభ్యులు ఫక్రుబాషా, పామిడి శీనా, పి.ఓబులేసు, టి.శీనా, శంకరయ్య, ఆర్ఎస్ శీనా, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకం ఏర్పాటు

బోరు వేస్తున్న అధికారులు

గుత్తి : పట్టణంలోని పాత సిపిఐ కాలనీలో మున్సిపల్ అధికారులు తాగునీటి పథకాన్ని ఏర్పాటు చేశారు. కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో బోరు వేసి 7.5 హెచ్‌పి మోటార్‌ను ఏర్పాటు చేసి తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత జీవనం సాగించాలి : డీఎస్పీ

ప్రజాశక్తి-పుట్లూరు

కోమటికుంట్లలో పర్యటిస్తున్న డీఎస్పీ వెంకట శివారెడ్డి

గ్రామాల్లో ప్రజలు గొడవలకు వెళ్లకుండా ప్రశాంత జీవనం సాగించాలని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి సూచించారు. సోమవారం రాత్రి ఘర్షణ జరిగిన నేపథ్యంలో మంగళవారం మండల పరిధిలోని కొమటికుంట్ల గ్రామంలో డీఎస్పీ పర్యటించారు. ఇందులో భాగంగా సిబ్బందితో కలిసి గ్రామం మొత్తం కలియతిరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొడవల జోలికి వెళ్తే జీవితాలు నాశనం అవుతాయన్నారు. ఘర్షణల వల్ల మీతోపాటు మీ కుటుంబం కూడా వీధిన పడే అవకాశాలుంటాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు. ఏమూనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాకాకుండా గొడవలు దిగితే కఠిన చర్యలతోపాటు రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

16 మందిపై కేసు నమోదు

మండలంలోని కోమటికుంట్ల గ్రామంలో నెలకొన్న ఘర్షణ కేసులో 16మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గ్రామంలోని జోగి నారాయణస్వామి, దాదన మనోహర్ మధ్య నెలకొన్న మనస్పర్థల కారణంగా సోమవారం రాత్రి గొడవ పడ్డారు. గొడవలో ఇరువర్గాల వారు కట్టెలతో కొట్టుకున్నారు. దీంతో మనోహర్‌తోపాటు ఆయన తరుపున ఏడుగురు, నారాయణస్వామితోపాటు అతని తరుపున ఏడుగురిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యే 'దగ్గుపాటి'ని కలిసిన జనసేన నాయకులు

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న జనసేన నాయకులు

అనంతపురం కలెక్టరేట్ : ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటప్రసాద్‌ను జనసేన జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా దగ్గుపాటి మాట్లాడుతూ టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు సమన్వయంతో పని చేయడంతో ఘనవిజయం సాధించామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పొదిలి బాబురావు, కుమ్మర నాగేంద్ర, రాపా ధనంజయ్, ఇండ్ల కిరణ్‌కుమార్, అవుకు విజయకుమార్, సదానందం, జక్కిరెడ్డి ఆదినారాయణ, హుస్సేన్, కుమ్మరి మురళి, ఎంసీ.బాలన్న (అడ్వకేట్), విజయ్‌రాయల్, ప్రసాద్, వెంకటసాయి, గోవర్ధన్, హరికృష్ణ, నౌషాద్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి

బెలుగుప్ప : వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో మలేరియా వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ కార్తీక్ కుమార్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాల విద్యార్థినులకు మలేరియా వ్యాధిపై అవగాహన కల్పించారు. అనంతరం మలేరియా నివారణపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కార్తీక్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. ఎప్పటికప్పుడు చేతులను శుభ్రం చేసుకుంటూ ఉండాలన్నారు. తాగునీటిని వేడి చేసి చల్లార్చిన తర్వాతనే తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, సూపర్‌వైజర్లు విజయకుమార్, తిరుపాలయ్య, వసంత, కస్తూరిబా పాఠశాల ఉపాధ్యాయినీలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎంపిని కలిసిన టిడిపి నాయకులు

శింగనమల : మండల పరిధిలోని పెరవలి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో మైనారిటీ నాయకులు సాదిక్‌వలి, టిడిపి యువ నాయకులు పుచ్చకాయల రాము, పెద్దన్న, బాలకుళ్లాయప్ప, తదితరులు ఉన్నారు.



ఎంపీ అంబికాతో శింగనమల టిడిపి నాయకులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి : పట్టణంలోని అనంతపురం రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక గోల్డెన్ కేఫ్ ఎదురుగా 44 జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొంది. ప్రమాదంలో బీసీ కాలనీకి చెందిన దస్తగిరి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.